క్లుప్తంగా

దెందులూరు ఏఎస్సైగా శ్రీనివాస్


ఏఎస్సై శ్రీనివాసరావు

దెందులూరు: దెందులూరు పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా ఏఎస్సైగా ఎ.శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా దెందులూరు పోలీస్ స్టేషన్ ఏఎస్సైగా నియమితులయ్యారు. దెందులూరు ఇన్‌చార్జి ఏఎస్సై చల్లా కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

యువతకు ఓటు నమోదు


గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

దెందులూరు: ఓటు వజ్రాయుధమని ప్రతి ఒక్కరూ ఓటు విలువను పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. గోపన్నపాలెం వ్యాయాయ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అధ్యక్షతన రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో యువతకు ఓటు ఆవశ్యకత, విలువపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఓటు హక్కును కళాశాలలో నమోదు చేశారు. తొలుత ప్రిన్సిపల్ నత్తానియేల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

భీమడోలు: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. మండలంలో కురెళ్లగూడెం, పూళ్ల గ్రామాలకు మంగళవారం తొలిసారిగా ఐయిడీ స్క్రీన్‌తో కూడిన ప్రచార రథం చేరుకుంది. గ్రామాల్లో సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా మహిళా కార్యదర్శి మామిడిపల్లి కృష్ణకుమారి, ఏవో ఎస్పీవీ ఉషారాణి, ఏపీఎం సురేష్‌కుమార్, గ్రామకార్యదర్శులు సూర్యకుమార్, గౌతమి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం


భీమడోలు జంక్షన్‌లో మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

భీమడోలు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో బీఎల్‌వోలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి హాజరయ్యారు. ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భీమడోలు వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల యువతీ యువకులు, బీఎల్‌వోలులో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన భారీ ర్యాలీ, ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భీమడోలు జంక్షన్‌లో భారీ మానవహారం చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, డీటీ షంషూద్దీన్, బీఎల్‌వోలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీలు

ఉంగుటూరు: ప్రజాస్వామ్యంలో ఓటువిలువ గొప్పదని ఆర్డీవో ఖాజావల్లి అన్నారు. మంగళవారం నారాయణపురం కళాశాల వద్ద స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరావు, అధ్యాపకులు కొండరవి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

పెదపాడు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీవీ సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాలలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపైన నమోదు చేసుకునే విధానంపైన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ప్రిన్సిపాల్ ఎస్ శ్రీకాంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు పట్టాల పంపిణీ

భీమడోలు: అసైన్డ్ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో సంబంధిత స్థల పట్టాలను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేయనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు. ఉంగుటూరు, భీమడోలు మండలాల పరిధిలోని రైతులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పట్టాలను భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద పంపిణీ చేస్తారని తెలిపారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

- ఏలూరు ఎంపీ శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో అభివృద్ధి పనుల ప్రారంభం


పెదవేగి: కొప్పాకలో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి


గణపవరం: వరదరాజపురంలో ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తిలకిస్తున్న నాయకులు, అధికారులు, ప్రజలు

పెదవేగి: విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని, రైతులకు, ఆక్వా రైతులకు, ప్రజలకు మేలు కలుగుతుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని కొప్పాక గ్రామంలో మంగళవారం రూ.139.66 కోట్ల వ్యయంతో 220/132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఏపీ ట్రాన్స్‌కో మంజూరు చేసిన ఈ విద్యుత్ ఉప కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని సభికులు వీక్షించి, సీఎం సందేశాన్ని ఆలకించారు.

సీఎం జగన్ సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రజలకు ఎంతో మేలు

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయంతో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో టి.నర్సాపురం, ద్వారకాతిరుమల, నారాయణపురం, మండలాల్లోని గ్రామాలకు ఉన్న విద్యుత్ సమస్యను తీరబోతుందని తెలిపారు. భీమడోలు, నూజివీడు, కామవరపుకోట, లైన్లు కలిపేందుకు కొప్పాక విద్యుత్ కేంద్రం నుంచి డీసీ లైన్లు కలపనున్నట్టు తెలిపారు. కొప్పాక సబ్‌స్టేషన్ ద్వారా రాబోయే రోజుల్లో ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాలు, కె.వి. నారాయణపురం పరిధిలోని ఉంగుటూరు మండలం నల్లజర్ల, భీమడోలు, నిడమర్రు మండలాల్లోని విద్యుత్ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, విద్యుత్ శాఖ ఏడీలు, డీలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడు మండలాలకు మణిహారం విద్యుత్ ఉపకేంద్రం

గణపవరం: గణపవరం మండలం సరిపల్లెలో రూ.61 కోట్ల వ్యయంతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో ఉపకేంద్రం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు ప్రశాంతి, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ గణపవరం, నిడమర్రు, అత్తిలి మండలాల ప్రజల విద్యుత్ అవసరాలను పూర్తిస్థాయిలో తీరుస్తుందన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది గణపవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆక్వా రైతులు, ప్రజలతో కలిసి విద్యుత్ సమస్యలు వివరించామన్నారు. మరొక నూతన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి సభాముఖంగా సీఎం హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకున్నారని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలు విద్యుత్ సమస్యలు తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వాసుబాబు, కలెక్టరు ప్రశాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పమ్మిలక్ష్మి, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీ సభ్యులు పాల్గొన్నారు.

30న గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న దెందులూరు స్కూల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించనున్నట్టు దెందులూరు నియోజకవర్గం స్పోర్ట్స్ కాంప్లెక్స్ చైర్మన్ డాక్టర్ మరీదు మనోహర్, దెందులూరు మండల చైర్మన్ జక్కుల సురేష్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 8.30 గంటలకు పెన్ను, నోటు పుస్తకం, పీఈటీ డ్రెస్ కోడ్‌తో స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్‌కు హాజరుకావాలని మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవి సూచించారు.

పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా పీటర్ పాల్

దెందులూరు: దెందులూరు మండల ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా డీ.పీటర్‌పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫెడరేషన్ కమిటీ జాయింట్ సెక్రటరీ జీవన్ కుమార్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ రత్నప్రసాద్, చిత్రాల జోసెఫ్, డీ.రాజారత్నం ఉన్నారు.

గ్రామాల్లో భారత్ సంకల్ప యాత్ర

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ వికాసిత భారత్ సంకల్ప యాత్ర సభ్యుడు గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. మంగళవారం సానిగూడెంలో సర్పంచ్ శనివల్లి రామకృష్ణ (విష్ణు) ఆధ్వర్యంలో గ్రామంలో వికాసిత భారత్ సంకల్ప యాత్రను దెందులూరు మండల అధ్యక్షుడు మండూరి బుజ్జి గోపాల్, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. యువమోర్చ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుజ్జుల బాబురావు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు


పెదపాడు: కొత్తూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నేతలు


ఉంగుటూరు: పథకాలను వివరిస్తున్న మరడ మంగరావు, తదితరులు


భీమడోలు: పోలసానిపల్లిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కనమాల రామయ్య


దెందులూరు: గోపన్నపాలెంలో అభివృద్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించిన జెడ్పీటీసీ తదితరులు


నిడమర్రు: తోకలపల్లిలో సంక్షేమ బ్రోచర్స్ లబ్ధిదారులకు అందిస్తున్న సంకు సత్యకుమార్

పెదపాడు: ప్రజల ఇంటి ముంగిటకే వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్తూరు గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలతో కూడిన బోర్డును ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడ అక్కినేని రాజశేఖర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, సర్పంచ్ కడిమి పద్మావతి, నాయకులు కడిమి గోవిందరావు, బాల్ద ప్రసాద్, తోళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాకర్లమూడిలో పల్లెకు పోదాం

ఉంగుటూరు: పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం ఉంగుటూరు మండలంలోని కాకర్లమూడి, వీఏ పురంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు ఆధ్వర్యం వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రభుత్వం రూ.19.38 కోట్లు ఖర్చు చేసిందని వారు తెలిపారు. దీనికి సంబంధించిన బోర్డును స్థానిక సచివాలయంలో ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, రాజేంద్రప్రసాదు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోన పోతురాజు, వీఏ పురం అధ్యక్షుడు వర్రింకల ప్రసాదు, సచివాలయ పార్టీ కన్వీనర్ బాలాజీ, నాయకులు గౌడ అప్పారావు, తోట కాంతరావు, మద్దుల ప్రసాదు, జలసూత్రం రామకృష్ణ, నౌడు మహంకాళరావు పాల్గొన్నారు.

చేబ్రోలులో ..

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం చేబ్రోలులో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. అబిరెడ్డి వారి వీధి, రామాలయం వీధిలో ప్రతి ఇంటికీ నాయకులు వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్తా బుజ్జి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, మనసాల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు రాయిలక్ష్మి, సోలాపురి ప్రసాదు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

భీమడోలు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. పోలసానిపల్లిలో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. సచివాలయం వద్ద గ్రామంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఆజామ్, వార్డు సభ్యుడు రాజారావు, మాజీ సర్పంచ్ చిలపర్తి రామారాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి మధు, నాయకులు కాలి రవి, మంచెం నాగు, గురునాథ్ గోవింద్, చెరుకు మధు, కోట దుర్గారావు పాల్గొన్నారు.

జగనన్న వెంటే అన్ని వర్గాల ప్రజలు

దెందులూరు: సీఎం జగనన్న వెంటే అన్ని వర్గాల ప్రజలున్నారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డు వద్ద లబ్ధిని వివరించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, కొండేటి గంగాధరబాబు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు, తోట వెంకన్న, వార్డు మెంబర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

నిడమర్రు: రాష్ట్ర ప్రజల ఆర్థిక అభివృద్ధికి ప్రజా సంక్షేమ పథకాలు దోహదపడేలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలన కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు. మంగళవారం తోకలపల్లి గ్రామ సచివాలయం పరిధిలో మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో ×వై ఏపీ నీడ్స్ జగన్« కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బోర్డును సత్యకుమార్ ప్రారంభించి అనంతరం తోకలపల్లి సచివాలయం పరిధిలోని తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన జెండా వేదికల వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ తోకలపల్లి సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లుగా రూ.35 కోట్లు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గణసల కృష్ణకుమారి, వంజరపు సత్యనారాయణ, ఓగిరాల ప్రభాకరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బలే నల్లకొండలు, ఓగిరాల దావీదు, ఇసుకపాటి నాగేంద్ర, సచివాలయం కన్వీనర్లు బలే చినబాబు, బయ్యే విజయ్,వంజరుపు నాగసత్యనారాయణ, నిడమర్రు సర్పంచ్ పొట్నూరి ఉమా పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థుల సందడి


నారాయణపురం హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి 1983–84లో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం కలుసుకుని సందడి చేశారు. నారాయణపురం మాజీ ఉప సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా శ్రీను, భూపతిరాజు రామరాజు, మద్దూరి ఉదయకుమార్, నారాయణపురం మాజీ సర్పంచి అక్కిన నాగమణి, ముళ్లపూడి చిన్ని ఆధ్వర్యం వహించారు. పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చలోక్తులతో సరదాగా గడిపారు. అలనాటి గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అంతా సహపంక్తి భోజనాలు చేశారని అడపా శ్రీనివాసరావు వివరించారు.

సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం


బువ్వనపల్లిలో ఎస్ఏ పరీక్షల నిర్వహణను తనిఖీ చేస్తున్న ఎంఈవో రాంబాబు

గణపవరం: గణపవరం మండలంలో మంగళవారం సమ్మేటివ్ ఎస్‌సెమెంట్–1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. తొలిరోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. ఉదయం 1 నుంచి 5 తరగతులు, 6,8,10 తరగతులకు మధ్యాహ్నం 7, 9 తరగతులకు పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 50 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలతో పాటు మరో 20 ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 15 వేల మంది ఎస్ఏ–1 పరీక్షలు రాస్తున్నారు. ప్రతిరోజూ పరీక్షా పత్రాలను ఆయా పాఠశాలల సముదాయ కేంద్రాల నుంచి పరీక్ష ప్రారంభానికి గంట ముందు ప్రధానోపాధ్యాయులు తెచ్చుకోవలసి ఉంది. ఈనెల 29, 30 తేదీల్లో పాఠశాల సముదాయ సమావేశాలు ఉన్నందున ఆ రెండురోజులు పరీక్షలు నిర్వహించరు. డిసెంబర్ 1వ తేదీ నుంచి యథావిధిగా పరీక్షలు కొనసాగుతాయని ఎంఈవో శేషు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న తీరును ఎంఈవోలు శేషు, బాలయ్య, రాంబాబు, సీఆర్పీలు పరిశీలించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



పూళ్లలో హిందూ ధర్మ విశిష్ఠతను వివరిస్తున్న ప్రవచన కర్త రాదా మనోహర్ దాస్

భీమడోలు: హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రవచన కర్త రాధా మనోహర్ దాస్ అన్నారు. పూళ్లలో గోదావరి కాల్వపై వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఆకాశ దీపం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలను ఉపన్యాసించారు. తొలుత ప్రధాన స్వామి వార్లకు విశేష పూజలు చేసారు. అనంతరం రాధా మనోహర్ దాస్‌ను ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు కొత్తూరి గోపి, కాపు సంక్షేమ సేన జిల్లా యూత్ కార్యదర్శి లింగంపల్లి మణికంఠ, పెద్దలు పెనుగొండ శ్రీనివాసరావు, కొండే వంశీ పాల్గొన్నారు.

3 నుంచి ఆగ్రో టెక్ సదస్సు

దెందులూరు: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో గుంటూరు లాంగ్ పార్క్‌లో ఆగ్రో టెక్ సదస్సు నిర్వహిస్తున్నామని ఏరువాక సమన్వయకర్త (ఏలూరు) డాక్టర్ టీ సుజాత అన్నారు. మంగళవారం దెందులూరులో ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ నూతన వ్యవసాయ సాంకేతిక అంశాలు, పలు పంటలకు సంబంధించి నూతన వంగడాలు, సాగు పద్ధతులు, సస్యరక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు, విద్యార్థులు, డీలర్లు ఈ సదస్సుకు హాజరుకావాలని డాక్టర్ సుజాత కోరారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం


భీమడోలులో ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి

భీమడోలు: ఎన్‌సీసీ విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, తద్వారా బంగారు భవిష్యత్తు సిద్ధిస్తుందని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావల్లి అన్నారు. భీమడోలు వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌సీసీ విభాగం 19ఏ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ బి సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ శిబిరాన్ని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో ఖాజావలి మాట్లాడుతూ ఎన్‌సీసీ బి సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లకు ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ అందుతుందన్నారు. రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కె.శివశంకర్‌ను ఆయన అభినందించారు. ప్రిన్సిపల్స్ బొమ్ము రవికుమార్, వి.నాగేశ్వరరావు రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ఏలూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు వైద్యురాలు పావని మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల కన్నా మిన్న అన్నారు. అనంతరం క్యాడెట్లు 22 యూనిట్ల రక్తదానాన్ని అందించారు. వారికి సరిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శశికాంత్, నాగరాజు, సిబ్బంది పరమేశ్వరరావు, క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

పెదవేగి : ఆడుదాం.. ఆంధ్రా క్రీడోత్సవాల్లో పాల్గొనే ఔత్సాహికులు తమ పేర్లను ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పెదవేగి ఎంపీడీవో జి.ఆర్. మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలకు సోమవరం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైయిందన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 13వ తేదీవరకు రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాండ్మింటన్, క్రీడా పోటీల్లో 15 ఏళ్లు నిండిన మహిళలు, పురుషులు అందరూ అర్హులని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే ఔత్సాహికులు డిసెంబర్ 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో లేదా, 1902 నంబర్‌కు కాల్ చేసి లేదా తమ సమీప గ్రామ, వార్డు సచివాలయం, వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 3న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. డిసెంబరు 15 నుంచి 22 వరకు గ్రామస్థాయిలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

దెందులూరు: డిసెంబర్ 15 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే క్రీడా పోటీలకు గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని దెందులూరు ఎంపీడీఓ భీమరాజు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఇతర క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులంతా డిసెంబర్ 13లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరింత సమాచారానికి స్థానిక సచివాలయంలోని వలంటీర్లను సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు.